సాక్షి
నిర్మల్
ఆదివారం । 24 । నవంబర్ । 2024



చెరువుల సందర్శన

జిల్లాలోని తుర్కం, యెంగన్న చెరువులను ఐటీకోస్ బృందం సందర్శించింది. వీరికి అధికారులు బస ఏర్పాటు చేశారు. 8లో▶



కళ్లముందే కబ్జా

జిల్లాలో చెరువుల ఆక్రమణకు అడ్డుకట్ట పడటంలేదు. జిల్లా కేంద్రంలోనే గొలుసుకట్టు చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. 9లో▶

గరిష్టం/కనిష్టం
29.0 / 14.0

వాతావరణం

ఆకాశం స్వల్పంగా మేఘావృతమవుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలితీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లా కేంద్రంలో తనిఖీలు



జాగిలాలతో తనిఖీ నిర్వహిస్తున్న సీఐలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో శనివారం టౌన్, రూరల్ పోలీసులు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, మాట్లాడుతూ.. గంజాయి డ్రగ్స్ సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గత నిందితులకు తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ అధికారులు ప్రేమ్‌కుమార్, లింబాద్రి, రవికుమార్, డాగ్ స్క్వాడ్ టీం, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల దత్తత



విద్యార్థులు, ఉపాధ్యాయులతో చౌహాన్‌కృష్ణ

నర్సాపూర్ (జి): ఎస్పీ స్ఫూర్తితో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చౌహాన్‌కృష్ణ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌ను దత్తత తీసుకున్నారు. శనివారం ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. పాఠశాలను దత్తత తీసుకునే అవకాశం కల్పించిన ఎస్పీ జానకీ షర్మిల, ఎంఈవో, హెచ్ఎం కిషన్‌రావుకు చౌహాన్‌కృష్ణ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

సఫారీ ట్రాక్ సందర్శన



మైసంపేట్ పాత గ్రామంలో అధికారులు

కడెం: మండలంలోని ఆటవీ ప్రాంతాలను శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్, సీసీఎఫ్ శర్వానంద్ సందర్శించారు. లక్ష్మీపూర్ సఫారీ ట్రాక్, మైసంపేట్ పాత గ్రామాన్ని పరిశీలించారు. పునరావాసంలో భాగంగా గ్రామాన్ని తరలించిన అనంతరం గడ్డి క్షేత్రాల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్నట్లు చర్యలను అధికారులకు వివరించారు. వీరి వెంట డీఎఫ్‌వో నాగిణీభాను, ఎఫ్‌డీవో భవానీశంకర్, ఎఫ్ఆర్వో అనిత, డీఆర్వో ప్రకాశ్, అటవీశాఖ సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలి

నిర్మల్ రూరల్: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని డీఈవో రామారావు శనివారం ఓ ప్రకటనలో సూచించారు. 'పునరుత్పాదక ప్రత్యామ్నాయ ఇంధన వనరులు' అంశంపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, సంక్షేమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మండల స్థాయిలో ఈనెల 27లోపు పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఇదే అంశంపై ఈనెల 30న జిల్లాస్థాయి పోటీలను జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హులని, వీరిని ఈనెల 30న జిల్లాస్థాయి పోటీలకు తీసుకురావాలని సూచించారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను డిసెంబర్ 3న రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు వివరించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేసి మండల స్థాయి పోటీలు నిర్వహించాలని సూచించారు.

నేడు పొట్టపెల్లికి ఐఏఎస్‌లు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి గ్రామానికి ఆదివారం ఐఏఎస్ అధికారులు రానున్నట్లు ఎంపీడీవో రాధ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని స్థితిగతులు, ప్రభుత్వం ద్వారా అందుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాల గురించి అధికారులు తెలుసుకుంటారని ఎంపీడీవో పేర్కొన్నారు.

భైంసాలో 30 పోలీస్‌యాక్ట్

భైంసాటౌన్: పట్టణంలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ఎలాంటి ర్యాలీలు, బహిరంగసభలకు అనుమతి లేదని పట్టణ సీఐ గోపీనాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భైంసా పట్టణంలో టిప్పుసుల్తాన్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహణకు అనుమతి ఉందంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిని నమ్మవద్దని సూచించారు.

జానీ.. ఉండొచ్చుగా..!

- ఇక్కడే ఉండే అవకాశాలు లేవా?
- ఉచ్చులు, వేటగాళ్లతో ప్రమాదమా?
- స్థిరంగా ఉండేందుకు అడ్డంకేంటీ?
- జిల్లా అడవులకు వచ్చివెళ్తున్న పులి



కుంటాల మండలంలో ఇటీవల కనిపించిన పెద్దపులి

నిర్మల్: జానీ మళ్లీ వచ్చింది. నిర్మల్ జిల్లా అడవుల్లోకి తిరిగి అడుగుపెట్టింది. ఇక్కడే ఉంటుందో, తిరిగి ఎటైనా వెళ్లిపోతుందో తెలియదు. ఎక్కడో తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వందల కిలోమీటర్లు దాటి ఇక్కడి దాకా వస్తోందంటే ఇక్కడ దానికి కావాల్సిన అనుకూలతలు ఎంతోకొంత ఉన్నట్లే. కానీ.. పెద్దపులి జిల్లాలో స్థిరంగా ఎందుకు ఉండట్లేదన్నదే ప్రశ్న. ఇప్పుడు జానీ వచ్చివెళ్తున్నట్లే, గతంలోనూ ఎన్నో పెద్దపులులు జిల్లాకు వచ్చివెళ్లాయి. ఒకట్రెండు ఇక్కడే ఉచ్చులు, వేటగాళ్లకు బలైపోయాయి. మిగతావి తిరిగి వచ్చిన దారినే వెళ్లిపోయాయి. తాజాగా నెలరోజుల నుంచి తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన జానీ అనే పెద్దపులి నిర్మల్–ఆదిలాబాద్ అడవుల్లో తిరుగుతోంది. దానికి కావాల్సిన తోడు కోసం వెదుకుతూనే ఉంది. ఇలా వచ్చిన పులులు ఇక్కడే ఉండాలంటే ఏం చేయాలన్న చర్చ కూడా సాగుతోంది.

పులి ఉండాలంటే ఏం చేయాలంటే..

మిగతా అటవీ జంతువులతో పోలిస్తే పెద్దపులి తీరు కొంత వేరుగానే ఉంటుంది. ఇందులోనూ ఆడపులి తాను ఉన్న ప్రదేశం నుంచి 6–7కిలోమీటర్ల పరిధిలోనే సంచరిస్తుంది. కానీ,, మగపులి తోడు–నీడ కోసం వందల కిలోమీటర్లయినా నడుస్తూనే ఉంటుంది. అరణ్యంలో తనకంటూ కంఫర్ట్‌జోన్‌ను ఎంచుకుంటుంది. ఇలా కంఫర్ట్‌జోన్‌తో పాటు మేటింగ్ కోసమే జానీ అనే పులి వందల కిలోమీటర్లు వాకింగ్ చేస్తూనే ఉంది. జిల్లా అడవుల్లోనే పెద్దపులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవాలంటే.. అవి వేటాడి ఆహారంగా తీసుకునేందుకు కావాల్సిన జింకలు, దుప్పులు లాంటి వన్యప్రాణుల సంఖ్య పెరగాలి. వన్యప్రాణుల సంఖ్య పెంచాలంటే విస్తారంగా గడ్డిక్షేత్రాలు, నీటివసతులు కల్పించాలి. ఈ దిశగా అటవీశాఖాధికారులు కృషిచేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలించారు. మరో రెండుమూడు గ్రామాలు ఇంకా అడవుల్లోనే మిగిలాయి. ప్రధానంగా పులి మనుగడకే ప్రమాదంగా మారే ఉచ్చులు, కరెంట్‌తీగలు, వేటగాళ్ల భయం లేకుండా చూడాలి. ఇందుకోసం అటవీశాఖలో సరిపడా అధికారులు, సిబ్బందినీ పెంచాల్సిన అవసరముంది. అటవీశాఖకు జిల్లా వాసులూ సహకరిస్తేనే నిర్మల్ జిల్లా పెద్దపులులకు ఆవాసంగా మారుతుంది. అప్పుడు.. టైగర్‌లను చూసేందుకు ఎక్కడో ఉన్న తాడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యాలకు వెళ్లాల్సిన అవసరమూ ఉండదు.

మనిషి అంటేనే భయం

బెబ్బులిని చూస్తే అడవి భయపడుతుంది. అలాంటి పులి కూడా మనిషిని చూస్తే బెదురుతోంది. ఎక్కడ కరెంట్ షాక్ పెట్టి చంపుతాడో.. ఎందులో విషం కలిపి ఉసురు తీస్తాడో.. అని భయపడుతూనే ఉంది. అందుకే దట్టమైన అడవుల్లోనే 'బతుకు జీవుడా..' అనుకుంటూ బతుకుతోంది. గత కొన్నేళ్లుగా అడవుల జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎన్నో పులులు వేటగాళ్ల ఉచ్చులు, స్మగ్లర్ల స్కెచ్‌లకు బలైపోయాయి. 2018లోనే వరుస ఘటనలు చోటు చేసుకున్నాయి. అప్పట్లో వైల్డ్ లైఫ్ క్రైం సెంట్రల్ టీమ్ సభ్యులు ఇచ్చోడలో ఓ పులిచర్మం పట్టుకోవడం సంచలనమైంది. ఈ కేసులో కూపీలాగితే, పెంబి మండలం తాటిగూడకు చెందిన ఇద్దరు అదే మండలంలోని పుల్గంపాండ్రి అడవుల్లో ఆ పులిని చంపినట్లు తేలింది. విద్యుత్ ఉచ్చుతో పులిని హతమార్చినట్లు గుర్తించారు. అదే సమయంలో పాత మంచిర్యాల బీట్‌లో చిరుతను హతమార్చడం, శివ్వారం బీట్‌లో ఏకంగా రాయల్ బెంగాల్ టైగర్‌ను మట్టుబెట్టడం తీవ్ర సంచలనం సృష్టించింది. కవ్వాల్ అడవుల్లోకి వచ్చిన పులిని వచ్చినట్లే చంపుతుండటంపై సర్కారు సీరియస్ అయ్యింది. ఏకంగా కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీఎఫ్)తో పాటు నాలుగు జిల్లాల్లోని పలువురు డీఎఫ్‌వోలు, ఎఫ్ఆర్వోలు, ఎఫ్ఎస్వోలు, ఎఫ్‌బీవోలను బదిలీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

కవ్వాల్ 'గుడ్'.. కానీ..

కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలో ఉంది. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో భాగంగా ఉండే కొండలు, దట్టమైన అడవులతో ఉంటుంది. 2012లో కేంద్ర ప్రభుత్వం దేశంలో 41వ, రాష్ట్రంలో రెండో పులుల అభయారణ్యంగా కవ్వాల్‌ను ప్రకటించింది. ఇది దాదాపు 2,020 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇందులో 897 చదరపు కిలోమీటర్లు పెద్దపులి సంచరించే కోర్ ఏరియాగా, 1,123 చదరపు కిలోమీటర్లు వేటాడే బఫర్ ఏరియాగా విభజించారు. నాలుగేళ్లక్రితం దాదాపు ఎనిమిది పెద్దపులులు, నాలుగు కూనలు అభయారణ్యంలో తిరిగాయి. కవ్వాల్‌కు వచ్చిన ఒక్క ఫాల్గుణ అనే పులి ఏడు పిల్లలకు జన్మనిచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) జాబితాలోనూ కవ్వాల్ రేటింగ్ 'ఫెయిర్' నుంచి 'గుడ్' స్థానానికి పెరిగింది. కానీ.. పులుల రాక మాత్రం ఆశాజనకంగా కనిపించడం లేదు.

మళ్లీ పులి కదలిక

- పరిమండల్‌లో పాదముద్రల గుర్తింపు
- కాగజ్‌నగర్ ప్రాంతం నుంచి వచ్చినట్లు అధికారుల వెల్లడి

మామడ: జిల్లాలో మళ్లీ పులి కదలికలు కనిపిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం జిల్లా అటవీ ప్రాంతం నుంచి పులి వెళ్లిందని.. ఇక ఏ భయం లేదని అటవీశాఖ అధికారులు అటవీ సమీప గ్రామస్తులకు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే మరో పులి కదలికలు గుర్తించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పరిమండల్ సమీపంలో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. పరిమండల్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు. అక్టోబర్ 25న కిన్వట్ బోథ్ మీదుగా పులి తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి జిల్లాలోని అడెల్లి ప్రాంతంలోకి వచ్చింది. కుంటాల, దిలావర్‌పూర్, నర్సాపూర్, మామడ, పెంబి, ఖానాపూర్, కడెం, ఉట్నూర్, నార్నూర్ మీదుగా వెళ్లి ప్రస్తుతం బేల మండలంలో సంచరిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం నుంచి..

తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పులి మళ్లీ అదే ప్రాంతం వైపు వెళ్తూ పశువులపై దాడి చేసి చంపి తిన్నది. మొదటి పులి వెళ్లిందని అనుకునేలోపే రెండో పులి జిల్లాలో సంచరిస్తోంది. కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన పులి జన్నారం అభయారణ్యం మీదుగా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మామడ, సారంగపూర్ అటవీప్రాంతంలో దాని కదలికలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. అక్టోబర్ నుంచి జనవరి వరకు మేటింగ్ సీజన్ కావడంతో మగపులులు ఆడపులి కోసం తిరుగుతుంటాయి. తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పులి పశువులపై దాడి చేసి చంపి తిన్నదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కాగజ్‌నగర్ అటవీప్రాంతం నుంచి వచ్చిన పులి వయసులో మొదటి పులి కంటే చిన్నదని భావిస్తున్నారు. ఇది అటవీ జంతువులను వేటాడి తింటోందని, పశువులపై దాడి చేయకపోవచ్చని చెబుతున్నారు. రోజుకు 30 నుంచి 40 కిలోమీటర్ల వరకు పులులు తిరుగుతుంటాయని తెలిపారు.



పరిమండల్ సమీపంలో పులి పాదముద్రలు

పులి కదలికలు గుర్తించాం

మామడ అటవీ పరిధిలో పులి కదలికలున్నాయి. పరిమండల్ సమీపంలో దాని పాదముద్రలు గుర్తించాం. సారంగపూర్ మండలం రాణాపూర్ అటవీపరిధిలో పులి సంచరిస్తోంది. అటవీప్రాంతంలోకి వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– అవినాష్, ఎఫ్ఆర్వో, మామడ అటవీ క్షేత్రం

మెరుగైన వసతులు కల్పించకుంటే చర్యలు



మామడ: భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మామడ: విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించకుంటే కఠినచర్యలు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. శనివారం మామడ కేజీబీవీని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సందర్శించారు. తరగతి గదులు, వంట గది, మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిశీలించి నిత్యం శుభ్రంగా ఉంచేలా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం, నాణ్యమైన వంట సరుకులు, కూరగాయలు వాడాలని, పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించాలని సూచించారు. కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందున ప్రత్యేకాధికారి, ఎంపీడీవోకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో రామారావు, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, కేజీబీవీ కోఆర్డినేటర్ సలోమి కరుణ, ఎంఈవో వెంకటరమణారెడ్డి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని నాయుడువాడ–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష్ అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌లో చిన్నారులకు పంపిణీ చేసే పాలు, గుడ్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. నిర్మల్ సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ విజయగౌరి, జిల్లా పోషణ కోఆర్డినేటర్ నిరంజన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ శాలిని, ఆయా స్వరూప ఉన్నారు.

డీఈవోకు సన్మానం



రామారావును సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: నూతన డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన రామారావును ట్రస్మా నాయకులు ఆయన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గంగన్న, కోశాధికారి వినోద్‌కుమార్, నాయకులు సాయన్న, రాజేందర్, రమేశ్, చంద్రగౌడ్, పద్మనాభగౌడ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

'సరిహద్దు'లో కమల వికాసం

నిర్మల్: సరిగ్గా ఏడాదిక్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని సరిహద్దు ముధోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో బీజేపీ జయకేతనం ఎగురవేసింది. తాజాగా మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఆ రాష్ట్ర సరిహద్దులో గల మూడు నియోజకవర్గాల్లో కమలం వికసించింది. ఇక్కడి ఓటర్ల ప్రభావంతోపాటు నేతల ప్రచారం మహారాష్ట్ర సరిహద్దు నియోజకవర్గాల ఫలితాల్లో కనిపించినట్లు తెలుస్తోంది.

మూడుచోట్ల జయకేతనం..

జిల్లా సరిహద్దున గల కిన్వట్‌లో భీంరావుకేరమ్, ధర్మాబాద్‌లో రాజేశ్‌పవార్ బీజేపీ నుంచి గెలుపొందారు. అలాగే భోకర్‌లో మాజీ ముఖ్యమంత్రి, ఇటీవల బీజేపీలో చేరిన అశోక్‌రావు చౌహాన్ కూతురు శ్రీజ చౌహాన్ కూడా విజయం సాధించారు. సరిహద్దు జిల్లాకేంద్రమైన నాందేడ్‌లో బాలాజీ కల్యాణ్‌కర్ కమలదళం నుంచే గెలిచారు. ఆయా నియోజకవర్గాల్లో జిల్లాకు చెందిన ఓటర్లు చాలాచోట్ల కీలకంగా ఉన్న విషయం తెలిసిందే.

పనిచేయని 'హస్తం' మంత్రాంగం

ఈసారి మహారాష్ట్ర ఎన్నికలను కాంగ్రెస్ సీరియస్‌గా తీసుకుంది. జిల్లా సరిహద్దులోని మరాఠా నియోజకవర్గాలను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చూసుకున్నారు. ఎన్నికలకు ముందు భైంసాలో మూడురోజులపాటు మకాం వేసి మహారాష్ట్రలో మంత్రాంగం నడిపారు. కానీ.. ఎక్కడా ఆయన ప్రభావం కనిపించలేదు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ ప్రచారం చేసిన ప్రాంతాల్లో బీజేపీకి ఓట్లు భారీగానే వచ్చినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.



నిర్మల్ చైన్‌గేట్: పార్టీ జిల్లా కార్యాలయంలో నినదిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ విజయోత్సవాలు

నిర్మల్‌చైన్‌గేట్: మహారాష్ట్రలో బీజేపీ కూటమి ఘన విజయం సాధించగా శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో సంబరాలు జరుపుకొన్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాజు, సాగర్, శ్రావణ్‌రెడ్డి, అరవింద్, సుధాకర్, భాస్కర్, నరేశ్, శ్రావణ్, దిలీప్, భరత్, సత్యనారాయణ, నర్సయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి

లోకేశ్వరం: కొనుగోలు కేంద్రాలకుకి రైతులు నాణ్యమైన వరి ధాన్యం తీసుకువచ్చి మద్దతుధర పొందాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని హవర్గ, కిష్టాపూర్, లోకేశ్వరం, నగర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో వారంరోజుల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించామని, గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. అనంతరం నగర్ గ్రామ శివారు ప్రాంతంలోని గోదాంలను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్వో కిరణ్‌కుమార్, తహసీల్దార్ మోతీరాం ఉన్నారు.

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ పరిశీలించారు. కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. సేకరించిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. డీఎస్వో కిరణ్‌కుమార్, ఐకేపీ సీసీ ముత్యం తదితరులున్నారు.



లోకేశ్వరం: మండల కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కిశోర్‌కుమార్

గెజిటెడ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు శనివారం పట్టణంలోని హోటల్ మారుతి ఇన్‌లో ఎన్నికల అధికారులు ఎ.పరమేశ్వర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్షుడిగా పీజీ గంగారెడ్డి, సహ అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శంకర్, గోవర్ధన్, గోదావరి, సెక్రటరీగా దాత్రిక రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా మహ్మద్ మీరాజొద్దీన్, సుదర్శన్, రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవికుమార్, ప్రచార కార్యదర్శిగా ఈ విష్ణువర్ధన్, కార్యాలయ కార్యదర్శిగా రాజమల్లు, సాంస్కృతిక కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, క్రీడల కార్యదర్శిగా వినోద్‌కుమార్, సభ్యులుగా కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్, జైరామ్, అరుణశ్రీ ఎన్నికయ్యారు. వీరికి టీజీవో సెంట్రల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏలూరి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ఎ.సత్యనారాయణ నియామకపత్రాలు అందజేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న ప్రతిభారాజ్‌గౌడ్ బృందం

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సికింద్రాబాద్‌లోని లాలాపేటకు చెందిన డాక్టర్ ప్రతిభారాజ్‌గౌడ్ బృందం శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. నృత్యకారుల ప్రదర్శన భక్తులను మంత్రముగ్ధులను చేసింది. శివపార్వతి నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'ప్రజావ్యతిరేక విధానాలొద్దు'

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరించే కార్మిక, రైతు, వ్యవసాయ, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహజ వనరులు, సంపద, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెడుతుందని పేర్కొన్నారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి సమ్మె హక్కులను కాలరాస్తుందని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.గంగామణి, జిల్లా సహాయ కార్యదర్శి రాధ, జిల్లా కోశాధికారి బి.లలిత, జిల్లా కమిటీ సభ్యులు డి.పోశెట్టి, సత్తవ్వ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కుంటాల: వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బీసీ వసతిగృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తంజేశారు. ఆయన వెంట హెచ్‌డబ్ల్యూవో నాగేశ్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, దిలీప్ తదితరులున్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

క్లుప్తంగా

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక


మౌనిక

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడకు చెందిన గడ్డం మౌనిక ఇటీవల వెలువడిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైంది. ఎంఎస్సీ మ్యాథ్స్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసిన ఆమె జేఎల్ పరీక్ష రాసింది. ఫలితాల్లో ఎంపికకావడంపై తల్లిదండ్రులు గడ్డం శ్రీవాణి-గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

27 నుంచి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ లీగ్ పోటీలు

రామకృష్ణాపూర్: ఈనెల 27 నుంచి 29 వరకు పట్టణంలోని ఠాగూర్ స్టేడియం, మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పూల్ ఏ, పూల్ బీలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మొత్తం తొమ్మిది జట్లు లీగ్ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయని తెలిపారు. ఈనెల 29న మంచిర్యాల వివేకవర్ధని డిగ్రీ కాలేజీలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు


పరుగు పందెం పోటీలో క్రీడాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట మౌంట్ కార్మెల్ పాఠశాలలో శనివారం జిల్లా అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమైంది. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, కార్యదర్శి ఈ.మారయ్య, మౌంట్ కార్మెల్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఆల్ఫీ ఈ పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలతోపాటు ప్రోత్సాహక సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జీవరత్నం, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.నరేందర్, పీఈటీ రాంవేణు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్ర వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు శనివారం సొనాల బస్టాండ్ సమీపంలో గ్రామానికి చెందిన తుల గంగయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆయన్ను స్థానికులు బోథ్ సీహెచ్‌సీ ఆస్పత్రికి అటు నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బస్సును స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, దొడ్డిదారిన ప్రైవేట్ బస్సులు మహారాష్ట్ర నుంచి బెంగుళూరుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

గుప్తనిధుల తవ్వకాలకు యత్నం


పూజలు చేసిన దృశ్యం

బోథ్: గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు యత్నించారు. మండలంలోని సాకెర శివారులో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సాకెర శివారు గల పురాతన గడి వద్ద గుప్తనిధుల తవ్వకాలు జరిపే చోటు వద్ద కొందరు నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పసుపుతో పూజలు చేశారు. ఈ తతంగం ఓ వ్యక్తి ద్వారా బోథ్ పోలీసులకు చేరింది. కాగా గుప్తనిధుల కోసం తవ్వడానికి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు వస్తున్నారని తెలియడంతో సదరు వ్యక్తులు పారిపోయారు. అయితే మహారాష్ట్రకు చెందినవారే ఉంటారని భావిస్తున్నారు. మండలానికి చెందిన వ్యక్తి ద్వారానే ఈ ప్రణాళిక చేశారని తెలుస్తోంది. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దేశసేవకు మేముసైతం..

- డిఫెన్స్ రంగంపై కేడెట్ల ఆసక్తి
- 150 మందికి పైగా ఆర్మీ కొలువులు
- నేడు ఎన్‌సీసీ దినోత్సవం


మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: దేశంలో నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) డే నవంబర్ నాల్గవ ఆదివారం రోజున జరుపుకుంటారు. క్రమశిక్షణ కలిగిన యువతను దేశభక్తి పౌరులుగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. కేడెట్లలో కర్తవ్య భావం, నిస్వార్థ సేవ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే దీని ఉద్దేశం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేడెట్లు త్రివిధ దళాల్లో కొలువులు సాధించి దేశ సేవలో పాల్గొంటున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు సాధించేలా శ్రమిస్తున్నారు. ఎన్‌సీసీలో సీ సర్టిఫికెట్ సాధించి డిఫెన్స్ రంగంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్‌సీసీ డే సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు 'సాక్షి'తో ముచ్చటించారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ

దేశవ్యాప్తంగా యువత క్రమశిక్షణకు ఎన్‌సీసీకి పేరుంది. కర్తవ్యం, నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ, నైతిక విలువలతో వారి సర్వతోముఖాభివృద్ధికి అవకాశాలను అందిస్తోంది. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవలు, తదితర శిక్షణపై కేడెట్లను తయారు చేస్తోంది. ఇందులో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1984లో ఎన్‌సీసీ 32(ఏ)బీఎన్ ఆదిలాబాద్ యూనిట్ బెటాలియన్‌గా ఏర్పాటైంది. ప్రారంభంలో అవగాహన లేకపోవడంతో తక్కువ మంది ఎన్‌సీసీలో చేరారు. రానురాను మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఎన్‌సీసీలో శిక్షణ పొందారు. వేలాది మంది ఆర్మీ, నేవీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ వివిధ రక్షణ శాఖల్లో సుమారు 150 మందికి పైగా ఉద్యోగాల్లో చేరారు.

ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం

ఎన్‌సీసీ 1948 జూలై 16న ఐక్యత క్రమశిక్షణ అనే నినాదంతో వచ్చింది. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఏ,బీ,సీ సర్టిఫికెట్లు అందజేస్తారు. శిక్షణలో రాష్ట్రాలు, జిల్లాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చినవారికి ర్యాంక్‌లు అందిస్తారు. ఆర్‌డీసీ(రిపబ్లిక్ డే క్యాంపు) నిర్వహిస్తారు. ఏటా జనవరి 15న ఢిల్లీలో జరిగే పరేడ్‌కు ఎంపిక చేస్తారు. ఆర్‌డీ క్యాంప్‌నకు సెలెక్ట్ అయినవారికి డ్రిల్, లైన ఫ్లాగ్‌ఏరియా, కల్చరల్ ప్రోగ్రాం, బెస్ట్ కేడెట్ పోటీలు ఉంటాయి. రాష్ట్రాలకు చెందిన వారు పోటీ పడుతుంటారు. కార్యక్రమానికి రాష్ట్రపతి, ప్రధాని, మంత్రులు, ఢిల్లీ సీఎం, త్రివిధ దళాధిపతులు హాజరవుతారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన వారికి ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. రక్షణ దళంలో ఉద్యోగం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది.

డిఫెన్స్ ఉద్యోగాల్లో రిజర్వేషన్



ఎన్‌సీసీలో శిక్షణ పొందినవారికి డిఫెన్స్ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సీఐఎస్ఎఫ్, ఆర్పీ ఉద్యోగాలు సాధించారు.

– జాడి మహేశ్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్

దేశ సేవే లక్ష్యంగా



దేశ సేవచేయడమే తన లక్ష్యం. నేవీ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలనేది తన చిన్నప్పటి కల. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసి ఉద్యోగం సాధిస్తాను. ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నాను.

– బి.సంతోష్, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్


నేవీ ఆకాడమీలో చేరాలని..



ఇండియన్ నేవీ అకాడమీలో చేరాలని ఉంది. నేవీ ఆఫీసర్ ఉద్యోగం సాధించి తన కల సాకారం చేసుకుంటాను. కళాశాలలో చేరి ఎన్‌సీసీ శిక్షణ పూర్తిచేస్తాను. డిఫెన్స్ రంగంలో ఉద్యోగం సాధించేలా కృషిచేస్తాను.

– ఎం.అజయ్‌గౌడ్, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్

సేవాభావం పెరిగింది



ఎన్‌సీసీలో చేరిన తర్వాత సేవాభావం, క్రమశిక్షణ పెరిగింది. విద్యతోపాటు ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్నాను. ఫైరింగ్, పరేడ్ పోలీస్ ఉద్యోగాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతాయి. ఎస్సై ఉద్యోగం సాధిస్తా. ఎన్‌సీసీ.. భవిష్యత్తుకు బాటలు వేసుకునే మార్గం.

– ఏ.అజయ్, జూనియర్ ఎన్‌సీసీ కేడెట్

ఆర్మీ ఆఫీసర్‌నవుతా



మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తర్వాత ఎన్‌సీసీలో చేరాను. డిగ్రీతోపాటు ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ సాధించాక ఆర్మీ ఆఫీసర్‌నవుతా. చిన్ననాటి నుంచి పోలీస్ ఉద్యోగం ఇష్టం. కరాటేలో ప్రావీణ్యం ఉంది.

– శ్రీహిత, ఎన్‌సీసీ కేడెట్

ఆత్మస్థైర్యం పెరిగింది



ఎన్‌సీసీలో చేరిన తర్వాత ఆత్మస్థైర్యం పెరిగింది. ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటే ఆర్మీ, డిఫెన్స్‌ల్లో ఉద్యోగాలు సులువుగా సాధించవచ్చు. గన్ ఫైరింగ్, పరేడ్, ఫిజికల్ ట్రైనింగ్ తదితర ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడుతాయి. ఆర్మీలో ఉద్యోగం సాధించే దిశగా ముందుకెళ్తున్నాను.

– సౌమ్య, ఎన్‌సీసీ కేడెట్

చెరువుల సందర్శన


బృందానికి సూచనలు చేస్తున్న అధికారులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీక్షేత్రం పరిధిలోని తుర్కం, యెంగన్న చెరువులను హైదరాబాద్ నుంచి ఐటీకోస్ బృందం పర్యాటకులు శనివారం సందర్శించారు. ఆదివారం వరకు వీరు ఇక్కడే ఉండనున్నారు. అటవీ అధికారులు వారి కోసం శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడకు వచ్చే వలస పక్షులను తిలకించడానికి, అందాలను తమ కెమెరాల్లో బంధించనున్నారు. అటవీ అధికారులు బృందానికి సూచనలు చేశారు. పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఎలూసింగ్ మేరు, సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్ఓ నాగినిబాను, ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

భైంసారూరల్: మండలంలోని మాటేగాం వంతెనపై శనివారం వేకువజాము లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ నుంచి విజయవాడకు టైల్స్ లోడ్‌తో లారీ వెళ్తోంది. భైంసా-నిర్మల్ జాతీయ రహదారి మాటేగాం వంతెనపై అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ ఉపేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భైంసా రూరల్ సీఐ నైలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

నాలుగు రోజులుగా నరకయాతన

- గూడెం వంతెన కింద వృద్ధుడిని వదిలివెళ్లిన ఘటన


వృద్ధుడిని తీసుకెళ్తున్న బంధువులు

దండేపల్లి: అచేతన స్థితిలో ఉన్న వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు రోజుల క్రితం దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వంతెనకింద వదిలివెళ్లారు. ఎముకలు కొరికే చలిలో గజగజ వణుకుతూ మూలుగుతు పడి ఉన్న వృద్ధుడిని నది స్నానానికి వచ్చిన కొందరు గమనించారు. అతడితో మాట్లాడి వివరాలు తెలుసుకోగా నా పేరు మార్నేని పోచయ్య, గ్రామం ఇందారం, తనకు ఒక కుమారుడు ఉన్నాడని చెప్పాడు. అతన్ని ఇక్కడ ఎవరు వదిలి వెళ్లింది మాత్రం తెలియదన్నారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించిన వీడియోను స్థానికులు పలు వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ శనివారం సిబ్బందితో అక్కడకు చేరుకుని వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతన్ని మందమర్రిలోని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

పెళ్లికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి

- డ్రైవర్ అజాగ్రతతో కారు బోల్తా
- అమ్మమ్మ, మనుమరాలు మృతి
- బెల్లంపల్లిలో ఘటన


ప్రమాదానికి గురైన కారు


ప్రియ మేఘన (ఫైల్)


చికిత్స పొందుతూ మృతిచెందిన కళ్యాణి

బెల్లంపల్లి: బంధువుల పెళ్లికి ఉదయం కారులో సంబురంగా వెళ్లిన ఆ కుటుంబం.. కార్యక్రమం అనంతరం ఇంటికి బయల్దేరింది. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా.. డ్రైవర్ నిర్లక్ష్యంతో కారు అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి కన్నాల బస్తీకి చెందిన టింకరి.కల్యాణి(60), ఆమె కూతురు పారుపల్లి అలేఖ్య, అల్లుడు రాజేశ్, మనుమడు సాయి విక్రాంత్, మనుమరాలు ప్రియ మేఘన((9)తో కలిసి భూపాలపల్లిలో బంధువుల పెళ్లికి కారులో శుక్రవారం ఉదయం బయల్దేరి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత అందరూ తిరిగి బెల్లంపల్లికి బయల్దేరారు. మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకునేలోపు జాతీయ రహదారి ఒక్కసారిగా కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ప్రియ మేఘన అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన టింకరి కళ్యాణి మంచిర్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనలో అలేఖ్య ఆమె భర్త రాజేశ్ గాయపడ్డారు. కారు డ్రైవర్ కిరణ్‌కుమార్‌తోపాటు, అలేఖ్య కొడుకు సాయి విక్రాంత్ సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది.

నిద్రమత్తే కారణం..

కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. డ్రైవర్ కారును అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతోపాటు నిద్ర కమ్ముకు రావడంతో కారు అదుపు తప్పి బోల్తాపడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మరో పది నిమిషాలు సురక్షితంగా కారు నడిపి ఉంటే.. అందరూ క్షేమంగా ఇంటికి చేరుకునేవారని పేర్కొన్నారు. ఘటనాస్థలిని శనివారం ఉదయం బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్ పరిశీలించారు. అలేఖ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

దండేపల్లి: ఓ యువకుడిని హత్యచేసిన వ్యక్తి జైలు నుంచి విడుదలై కొన్నిరోజుల తర్వాత మళ్లీ గ్రామానికి రావడంతో వివాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. దండేపల్లి మండలం గూడెం ఒడ్డెర కాలనీకి చెందిన రాజమౌళి గ్రామానికి చెందిన యువకుడు అనిల్‌ని ఏడాది క్రితం మద్యంలో పురుగులమందు కలిపి తాగించి హత్య చేశాడు. దీంతో రాజమౌళిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇటీవల జైలు నుంచి విడుదలై కొద్దిరోజులు వేరే చోటు ఉంటున్నాడు. శనివారం ఒడ్డెర కాలనీలోని తన ఇంటికి వచ్చి పరిసరాలను శుభ్రం చేస్తుండగా అనిల్ తండ్రి శంకర్ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకోగా, రాజమౌళితో తమకు ప్రాణహాని ఉందని చెప్పాడు. పోలీసులు విచారణ చేస్తుండగా శంకర్ ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేయగా అడ్డుకున్నారు. నిందితుడు కాలనీలో ఉండకూడదని, మృతుడి తండ్రితోపాటు కాలనీవాసులు డిమాండ్ చేశారు. దీంతో న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

ఆలయంలో కార్తికదీపాలు



బాసర: కార్తికమాసం సందర్భంగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శనివారం భక్తులు పూజలు చేశారు. అనంతరం మహాలక్ష్మి, మహంకాళి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు, మహిళలు.. ఓంకారం, స్వస్తిక్, దుర్గామాత వివిధ ఆకృతులతో దీపాలను వెలిగించారు.

రిమ్స్ సూపర్‌స్పెషాలిటీలో అరుదైన ఆపరేషన్


థైరాయిడ్ కణితితో బాధపడ్డ నర్సవ్వ


ఆపరేషన్ ద్వారా తొలగించిన కణితి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు శనివారం అరుదైన ఆపరేషన్ చేశారు. అంకాలజిస్టు డాక్టర్ జక్కుల శ్రీకాంత్, ఈఎన్టీ సర్జన్ సత్యనారాయణ, అనస్థీషియా బృందం సుమారు గంటన్నర పాటు శ్రమించి ఓ వృద్ధురాలి మెడలో ఉన్న థైరాయిడ్ కణితిని విజయవంతంగా తొలగించారు. అనంతరం వైద్యుడు శ్రీకాంత్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వృద్ధురాలు నర్సవ్వ మెడలో థైరాయిడ్ కణితితో బాధపడుతోంది. ఈనెల 11న రిమ్స్‌లో చేరగా ఈఎన్టీ సర్జన్ సత్యనారాయణ పరిశీలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి థైరాయిడ్ కణితి ఉందని గుర్తించారు. బయట నుంచి అది 500 గ్రాములు కనిపించిందన్నారు. ఆపరేషన్ చేసి తీసేసరికి అది కిలోన్నర బరువు ఉందన్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సూచనతో ఆపరేషన్‌ను విజయవతంగా పూర్తి చేశామని తెలిపారు.

ఇద్దరు పోలీసులకు ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం అందుకుంటున్నరూరల్ సీఐ ఆకుల అశోక్


ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై గంగన్న


నస్పూర్/లింగాపూర్: గంజాయి కేసులో నేరస్తులకు శిక్షపడేలా చేసిన ఇద్దరు పోలీసులకు రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రస్తుత మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ప్రస్తుత లింగాపూర్ ఎస్సై గంగన్న గతంలో ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నప్పుడు గంజాయి సాగు కేసులో నేరస్తులను కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేయడంతో మేజిస్ట్రేట్.. ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. ప్రశంసాపత్రం అందుకున్నవారిని సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్‌రెడ్డి, ఏసీపీ ప్రకాశ్, లింగాపూర్ పోలీసులు అభినందించారు.

అడవి కుక్కలదాడిలో జింక మృతి


జింక కళేబరం

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ అటవీ ప్రాంతంలో అడవి కుక్కల దాడిలో జింక మృతిచెందింది. శనివారం అటవీ ప్రాంతానికి వెళ్లిన గ్రామస్తులు చూసి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అయితే పులి దాడిలో జింక మృతిచెందిందని గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పులి కాదని అడవి కుక్కలే జింకపై దాడి చేశాయని అధికారులు తేల్చారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పూలే దంపతుల జయంతి, వర్ధంతిని నిర్వహించాలి


ఉత్తరాలను ప్రదర్శిస్తున్న మాలీ సంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతి బాపూలే దంపతుల జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలో శనివారం పూలే దంపతుల విగ్రహాల ముందు జిల్లా అధ్యక్షుడు వాడగురే విజయ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులకు పోస్ట్ ద్వారా పంపే ఉత్తరాలను ప్రదర్శించారు. ఈనెల 28న జరిగే జ్యోతిబాపూలే వర్ధంతిని, వచ్చే జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి హైవే వద్ద అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి పట్టుకున్నారు. వీటిని ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంచిర్యాల ఇసుక రీచ్ నుంచి మందమర్రి మండలానికి ఇసుక రవాణాకు ఇంకా ఆన్‌లైన్ ఓపెన్ కాలేదని అప్పటివరకు అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. అనుమతులు ఒక చోట తీసుకుని మరో చోటికి సరఫరా చేయొద్దన్నారు.